# శరవేగంగా పల్లె దవాఖానల నిర్మాణం


గూడూరులో నిర్మిస్తున్న పల్లె దవాఖాన

- ఎస్‌బీపల్లి, గూడూరు, ఇన్ముల్‌నర్వలో 90 శాతం నిర్మాణాలు పూర్తి
- ఒక్కో భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు
- పల్లెవద్దకే కార్పొరేట్ వైద్యం

కొత్తూరు, అక్టోబర్ 12: గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పల్లె దవాఖానలకు తెచ్చింది. మొదట పట్టణాల్లో ప్రవేశపెట్టిన బస్తీ దవాఖానలు అద్భుత ఫలితాలు ఇవ్వడంతో పల్లెల్లో కూడా ఇలాంటి దవాఖానలను పెట్టాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నిర్ణయించారు. దీంలో రాష్ట్రంలోని చాలా గ్రామాల్లో పల్లె దవాఖానలు పురుడుపోసుకున్నాయి. కేవలం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందే వైద్యం నేడు పల్లెలకు విస్తరించారు. పల్లె దవాఖాన ద్వారా గ్రామాల్లో కూడా నిపుణలైన ప్రభుత్వ డాక్టర్ సారథ్యంలో వైద్యం అందుతున్నది. పల్లె దవాఖానలు ఏర్పాటు చేసిన గ్రామాల్లో ఓ డాక్టర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్ సారథ్యంలో వైద్యం అందిస్తున్నారు.

**శరవేగంగా భవన నిర్మాణాలు**

కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, గూడూరు, ఎస్‌బీపల్లిల్లో పల్లె దవాఖానలకు భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనాన్ని రూ. 20 లక్షలతో నిర్మిస్తున్నారు. సకల హంగులతో ఆ భవనాలను నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఈ భవనాల నిర్మాణానికి ఈ మధ్యనే శంకుస్థాపన చేశారు. పనులు చురుగ్గా జరిగి 90 శాతం భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ మూడు మండలాల్లోని ప్రైవేట్ భవనాల్లో పల్లె దవాఖానలు కొనసాగుతున్నాయి.

**ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో..**



ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సహకారంతో మండలంలోని ఇన్ముల్‌నర్వ, గూడూరు, ఎస్‌బీపల్లిలో పల్లె దవాఖానలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నాం. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ. 20 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. మరిన్ని నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు విజ్ఞప్తి చేశాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. నిధులు మంజూరు కాగానే వీటిని పూర్తి చేసి రోగులకు అందుబాటులోకి తెస్తాం.

– ఎమ్మె శ్రీలత, విద్య, వైద్య స్టాండింగ్ కమిటీ మెంబర్, కొత్తూరు జడ్పీటీసీ

## బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి

షాబాద్, అక్టోబర్ 12: అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖకు సంబంధించిన ఎజెండాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యుత్, తాగునీరు విషయాల్లో అధికారులు ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, ఎంపీడీవో అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంఈవో శంకర్‌రాథోడ్, ఏవో వెంకటేశం, ఏఈలు నరేందర్, శ్రీదివ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు తిరుగు లేదు

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 12 : రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని, కాంగ్రెస్, బీజేపీలకు అభ్యర్థులు లేరని కురుమ సంఘం మండలాధ్యక్షుడు కసిరె వెంకటేశ్, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎదిరె రాములు అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేవెళ్లలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గల్లంతయ్యాయని, ప్రతిపక్ష పార్టీల్లోని నాయకుల్లో అసహనంతో అభ్యర్థుల ప్రకటన ఇంకా పూర్తి కాలేదన్నారు. చేవెళ్లలో కాలె యాదయ్య నాయకత్వంలో భారీ మెజార్టీతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కౌకుంట్ల రైతు బంధు సమితి అధ్యక్షుడు చింతకింది నాగార్జున రెడ్డి, ఆలూరు రైతు బంధు సమితి అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్‌గా గీత



కేశంపేట, అక్టోబర్ 12 : కేశంపేట నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా గీత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఆనంద్‌రావు కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండల తహసీల్దార్‌గా పదోన్నతిపై వెళ్లారు. ఫరూఖ్‌నగర్ మండలంలో విధులు నిర్వహించిన గీత బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆజం అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిని కొనసాగించాలి


ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్లటౌన్, అక్టోబర్ 12: తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర ఎంతో కీలకమని, ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్ చారి, ఎంపీపీ విజయలక్ష్మి, జయశంకర్ సార్ మేనకోడలు జయశ్రీ శ్యాంసుందర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని అవిష్కరించారు. ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం విశ్వకర్మ సంఘం నాయకులను కలిసి జయశంకర్ సార్ సేవలను గుర్తు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..సార్ చివరి శ్వాస వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించారని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, జడ్పీటీసీ మాలతి, చేవెళ్ల సర్పంచ్ ఆగిరెడ్డి, ఎంపీటీసీలు రాములు, వసంతం, సత్యనారాయణ చారి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, నరేందర్ చారి, విశ్వకర్మ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెంకటాచారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బ్రహ్మచారి, విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 16న చింత చెట్ల ఫలసాయం కౌలు వేలం

షాబాద్, అక్టోబర్ 12: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన చింతచెట్ల ఫలసాయం కోసం ఒక ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు సోమవారం ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవాదాయశాఖ ఈవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే ఆసక్తి గల వారు ముందుగా చెట్ల ఫలసాయం కాపును చూసుకోవాలన్నారు. దేవస్థానానికి రూ.500 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం పాట పూర్తి అయిన తర్వాత మొత్తం రూపాయలలో సగం వెంటనే చెల్లించాలని సూచించారు. మిగతా సగం 8 రోజుల్లో చెల్లించాలన్నారు.

## రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్, అక్టోబర్12 : పంచాయతీకి సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం చిలుకూరు గ్రామ పంచాయతీని సందర్శించారు. గ్రామ పంచాయతీలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, వాటి రికార్డులు, మిషన్ భగీరథ నీళ్లు ఎన్ని లీటర్లు వస్తున్నాయి, విద్యుత్ బిల్లులు ఎంత కడుతున్నారు, దీనికి ఎంత విద్యుత్ ఉపయోగిస్తున్నారనే విషయాలను ఆన్‌లైన్‌లో చూసి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి బిల్లులు, విద్యుత్ బిల్లులు సక్రమంగా చెల్లించాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ పెండింగ్‌లో పెట్టరాదని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారితో పాటు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, కారోబార్ రాజేశ్ ఉన్నారు.

## గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పని చేయాలి


సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

మొయినాబాద్, అక్టోబర్ 12: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలె యాదయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని, ఆ దిశగా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చిలుకూరు గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చదువు రాంచందర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శ్రేణులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉమ్మడి పాలకులు తెలంగాణ అభివృద్ధిని విస్మరించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోర శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంఏ రవూఫ్, డైరెక్టర్ భిక్షపతిగౌడ్, అప్పోజిగూడ సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ సురేశ్, వార్డు సభ్యుడు వెంకటేశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేశ్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు ముజ్జు, యువజన విభాగం మండల అధ్యక్షుడు పరమేశ్, సీనియర్ నాయకులు సంగరి మల్లేశ్, గునుగుర్తి ఆంథ్రూ, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.




పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank
Together for the better
సర్కిల్ ఆఫీస్, GAD డిపార్ట్‌మెంట్, రీజెన్సీ ప్లాజా, (1వ అంతస్తు), ప్లాట్ నం.3, ఇం.నం. 7-1-450/RP/3/1/A, మైత్రివిహార్ ఏరియా, అమీర్‌పేట్, హైదరాబాద్- 500016., E-MAIL- cohydgad@pnb.co.in

**కార్యాలయ స్థలము కావలెను**

దిగువ తెలిపిన ప్రాంతంలో 980-1200 చ.అ. విస్తీర్ణం కలిగి ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్ నందు 3 ఫేజ్ పవర్ కనెక్షన్ 20 కెవిఎ లోడ్‌తో బ్రాంచ్ ఆఫీసు కొరకు (ATMతో సహా) కార్యాలయ స్థలం కావలెను.

**ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా**

ఇందుకు సంబంధించిన ప్రకటన పూర్తి వివరాలు మా వెబ్‌సైట్ www.pnbindia.inలో లభ్యమవుతాయి. ప్రతిపాదనలను పంపించేందుకు నిర్దేశించిన దరఖాస్తు ఫారం నమూనాలు పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్ సర్కిల్ ఆఫీస్, GAD డిపార్ట్‌మెంట్, రీజెన్సీ ప్లాజా, (1వ అంతస్తు), ప్లాట్ నం.3, ఇం.నం.7-1-450/RP/3/1/A, మైత్రివిహార్ ఏరియా, అమీర్‌పేట్, హైదరాబాద్-500016 నుండి తేది: 26.10.2023 మ. 2.00 గం.ల వరకు పొందవచ్చు. ఇ-మెయిల్: cohydgad@pnb.co.in. ప్రతిపాదనలను తేది: 26.10.2023 సా.4.00 గం.లలోపు పైన తెలిపిన చిరునామా వద్ద దాఖలు చేయవలెను.

తేది: 13.10.2023
ప్రదేశం: హైదరాబాద్
సం/- సర్కిల్ హెడ్, హైదరాబాద్ సర్కిల్